# హెబ్రయులకు వ్రాయబడిన పత్రిక

## మూడవ పాఠము

# మీ ధైర్యమును విడిచి పెట్టకుడి

**పాఠ్యోద్దేశము:** గ్రహీతల యొక్క "ఖచ్చితమైన సమస్యల పట్టిక"ను పూర్తి చేయుటకు, హెబ్రీ పత్రిక యొక్క చారిత్రాత్మక విశ్లేషణను కొనసాగించుట.

## ఉపోద్ఘాతము

పత్రికను పొందిన హెబ్రీ క్రైస్తవుల ఆత్మీయ బలహీనతలకు సంబంధించిన ఖచ్చితమైన మాటలు హెబ్రీ 10:32-39; 12:1-13లో గల లేఖనములయందు గలవు. ఈ వాక్యభాగములలో చెప్పబడిన కొన్ని ఖచ్చితమైన మాటలను మన "ఖచ్చితమైన పట్టిక"లో చేర్చుదము. హెబ్రీ క్రైస్తవులు పూర్వము, తమలో లేని కొన్ని తీవ్రమైన బలహీనతలను ఇప్పుడు అలవరచుకొన్నారు. "మీరు వెలిగింపబడిన పూర్వపు దినములను జ్ఞాపకము తెచ్చుకొనుడి"యని రచయిత వారిని ప్రోత్సాహించుచున్నాడు (హెబ్రీ. 10:32), "పూర్వపు దినముల"కు మరియు ఈ పత్రిక వ్రాయబడు సమయ మునకు మధ్య చాలా కాలము గడచిపోయినట్లు మనము అర్థము చేసుకొనగలము. వారు విఫలులు అయినప్పటికి, వారు బోధకులగుటకు వారికి తగినంత సమయ మున్నదని గత పాఠములో నేర్చుకొంటిమి. ఆ సంఘములోను లేక ఆ ప్రాంతములో గల సంఘములయందున్న సభ్యులందరును అలాగే ఉన్నారని ఈ విశ్లేషణ యొక్క భావము కాదు. మొదటి దినము నుండి అక్కడ ఉన్న సంఘ సభ్యులలో ఎక్కువ మంది సభ్యులు ఇంకా అక్కడే ఉన్నారు.

## పాఠము

ఈ పత్రిక వ్రాయబడు సమయమునకు హెబ్రీ క్రైస్తవుల ఖచ్చితమైన సమస్యల అన్వేషణను ప్రారంభించక ముందు, హెబ్రీ 10:32-34ను మనము మరల చదివి, పూర్వపు దినములలో క్రీస్తునందున్న ఆ సహోదరి, సహోదరుల స్థితిని రచయిత ఎలాగు వర్ణించెనో దానిని గ్రహించుటకు మనము ప్రయత్నించుదము. ప్రదర్శించబడిన, వారి విశ్వాసమును, ధైర్యమును చూస్తే, మనము ఆశ్చర్యపడుదము.

1. వారు కష్టాలపాలైనపుడు స్థిరముగా నుండిరి. శ్రమలను భరించడము వారికి ఒక పోరాటంగా మారెను.
2. కొన్నిసార్లు వారు నిందలను బాధలను అనుభవించుట చేత పదిమందిలో ఆరడిపడిరి.
3. మిగతా సమయములో వారు వాటిని అనుభవించిన వారితో పాలివారైరి.
4. ఖైదీలోనున్న క్రైస్తవులను వారు కరుణించిరి.
5. ఈ శ్రమలలో వారు తమ ఆస్తి కోల్పోయినను సంతోషముగా ఒప్పుకొనిరి. (హెబ్రీ 10:32-34).
6. వారు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంకా దానిని ఎదిరింపలేదు. (హెబ్రీ 12:4).

హెబ్రీ క్రైస్తవులు వెలిగింపబడినపుడు మొదట వారు ఏ స్థాయిలో ఉండి ప్రవర్తించారో, అక్కడ మనలను మనము నిలబెట్టుకొనగలిగితే, "మీ ధైర్యమును విడిచిపెట్టకుడి, దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును" (హెబ్రీ 10:35) అని రచయిత వారికి చేసిన హెచ్చరికను మనము బాగా అర్థము చేసికొన గలము. "మీకు ఓరిమి అవసరమై యున్నదని" (10:36) రచయిత వారి ఖచ్చితమైన సమస్యను ఉదహరించెను. ఈ పత్రిక వ్రాయబడు సమయమునకు వారికి ఓపిక లేకుండ పోవడమో లేక తక్కువగా ఉండడమో జరిగినది. దీనిని మనమిపుడు మన ఖచ్చితమైన సమస్యల పట్టికలో చేర్చి, తరువాత దీనిని చూచెదము.

వారున్న ఆ పూర్వపు దినములలో మనము వారితో కలిసి ఉన్నట్లైతే, వారి ధైర్యము ఎంత గొప్పదో తెలిసికొనగలిగేవారము. "పాలిచ్చే మన ఆవును" రోమా ప్రభుత్వము స్వాధీనము చేసుకొనివుంటే, ఆ చర్య మనకు బాగానే ఉందని మరి ఎక్కువగా ఆనందించగలమా? అని మనలను మనము ప్రశ్నించుకోగలిగితే, ఈలాంటి పరిస్థితులలో కూడ వారు ఎలాగు స్థిరముగా ఉండగలిగారు? అను ప్రశ్నను మనము అడుగవచ్చు. బుద్ధిహీనులు మాత్రమే ఆ రకమైన పరిస్థితిలో ఆనందించగలరని కొందరు నిశ్చయముగా చెప్పుదురు. కాబట్టి వారినేమి ఆవహించింది?

దీనికి అర్థవంతమైన జవాబు కొరకు, "వారు వెలిగింపబడినపుడు వారికి ఏమి బోధింప బడెను"? యను ప్రశ్నను మనము అడుగవలెను. కోల్పోయిన ఆస్తి కంటే, శ్రేష్ఠమైన స్వాస్థ్యము తమకున్నదని, వారి విశ్వాసము (వెలిగింపబడిన మొదట వచ్చినది) గనుక ఇది నిత్యమైన స్వాస్థ్యమునకు సంబంధించినదై యుండవచ్చును (10:34,38). వారు అబ్రాహామునకున్నటువంటి విశ్వాసము గలవారు గనుక తమ ఇండ్లను కోల్పోయి నపుడు కూడా వారు ఆనందించగలిగిరి. "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువునైయున్నది" (హెబ్రీ. 11:1)ని జ్ఞాపకము చేసుకొనుము. "దేవుడు వారికొరకు ఒక పట్టణమును సిద్ధపరిచెను. దేవుడు శిల్పియై నిర్మించిన ఆ పట్టణమును వారు చూచిరి. దానికి నిత్యమైన పునాది గలదని" వారి విశ్వాసము చెప్పెను (హెబ్రీ 11:10).

వారి విశ్వాసము తీవ్రమైనదని మనలో కొందరు అనుకొనవచ్చును. 'రాడిక్స్' అను లాటిన్ పదము నుండి రాడికల్ (తీవ్ర) అను పదము వచ్చినది. మూలము లేక ముఖ్యమైనది అని దీని

భావము. వాస్తవానికి వారి విశ్వాసము, దేవుడు మానవ జాతిని సృజించిన విధానమునకు మూలాధారమైనది. ప్రతి ఒక్కరు భద్రతను కోరుకొందురు. మనము కలిగియున్న ఆస్తులే మనకు భద్రతనిచ్చునుయని మనలో అనేకులు భావింతురు. అందుకే మనము ఎక్కువ కాలము ఉండు సంపదకు, భద్రతకు సంబంధించి 'ఎక్కువ విలువను' ఇస్తాము. గనుక పూర్వపు దినములలో, శ్రేష్ఠమైన స్వాస్థ్యమును స్వతంత్రించి హత్తుకొనుటకై వారు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చిరి. కొన్ని నాణేలను వదిలివేస్తే, ఆ పని వలన ఎక్కువ నాణేలను నిశ్చయముగా పొంద గలమని రూఢి అయినప్పుడు, మనము చేసిన పనినిబట్టి మనము ఆనందించగలము.

తాను వారి దేవుడని అనిపించుకొనుటకు దేవుడు వారిని గూర్చి సిగ్గుపడడని ప్రారంభ దినములలో వారు ధైర్యము కలిగి ఉండేవారు. మరియు వారు తాము కోల్పోయిన ఆస్తుల కంటే శ్రేష్ఠమైన స్వాస్థ్యము కొరకు ఎదురు చూచిరి (హెబ్రీ 11:16). వారు అసలు బుద్ధిహీనులు కారు. విశ్వసిస్తే చాలు-రక్షణ పొందుదము (హెబ్రీ. 10:39)అను మాటను బట్టి పూర్వపు దినములలో జీవితం తేలికైనది. 'రక్షణ పొందుట' అనగా, భూమి మీద తమకుగల ఆస్తి కంటే, పరలోకము లోనున్నదే శ్రేష్ఠమైన స్వాస్థ్య మని వారు భావించేవారు.

భూమి మీదనున్న తమ ఆస్తులను కోల్పోయినప్పుడు వారు ఎందుకు ఆనందించగలిగారో మనమిప్పుడు అర్థము చేసికొనగలము, గాని నిందలు, అవమానములు మరియు ఖైదీలో వేయబడు సంగతుల విషయము ఏమిటి? అలాంటి పరిస్థితిని కూడ, సానుకూల మలుపుగా మనము ఎలాగు భావించాలి? సరే, వారు పొందిన నిందలు, రక్తము కార్చునంతగా వారిని నడిపించలేదని మనకు చెప్పబడెను.

దేవుడు సర్వశక్తిమంతుడైతే, వారి దేవుడని పిలిపించుకొనుటకు ఆయన సంతోషపడిన వాడైతే, మరెందుకు ఆయన వారిని పాపుల చేత అన్ని రకాలుగా హింసింపబడుటకు అనుమతించు చున్నాడని కొందరు వాదించవచ్చును. ఈ ప్రశ్నకు ఆచరణాత్మ కమైన ఒక జవాబు కలదు. **వారు దేవుని కుమారులని గుర్తింపు పొందిరి.** గుర్తింపు, ఒక వ్యక్తి ధైర్యముగా ఉండుటకు ఎల్లప్పుడు కీలకమైన పాత్రను పోషించును. మన గుర్తింపు గురించి మనకు ఎక్కువ నమ్మకము కలిగితే, ఆశానిగ్రహమును అభ్యసించు టకు మనము ఎక్కువ ధైర్యము కలిగి యుందము. దేవుని కుమారులుగా పొందిన గుర్తింపు కంటే మించిన ఉన్నత స్థాయిగాని, సురక్షితమైన స్థితిగాని మరొకటి లేదు. (గలతీ 4:4-6).

వారు 'వెలిగింపబడిన' మీదట వినిన సందేశమును గూర్చి అప్పటి వారి ఓర్పును, ధైర్యమును గూర్చి మనము ఆలోచించవలసిన అవసరమున్నది. దయచేసి హెబ్రీ 12:5-13ను చదువుము. హెబ్రీ పత్రికలో మనము చదువు గొప్ప ఆశీర్వాదము లన్ని, వారికి ప్రకటింపబడిన సువార్తలో వారు విని మార్చబడిరి. సువార్త వారికి నిశ్చల మైన రాజ్యమును అనుగ్రహించెను (హెబ్రీ 12:28). కేవలము పరలోక యెరూషలే మని పిలువబడు సంఘము యొక్క సభ్యత్వమును సువార్త వారికి అనుగ్రహించెను. హెబ్రీ 12:22-24ను చదువుము. వారి సమస్యను అర్థము చేసికొనుటకు మనము యిలాగు చెప్పుకొంటు పోవచ్చును గాని, ప్రారంభ దినములలో వారికి ఈ సువార్త ప్రకటించబడినపుడు, వారు దేవుని కుమారులు కాగలరని వారికి చెప్పబడుటను మనము తెలిసికొనవలసిన అవసరము మనకున్నది. వారు క్రైస్తవులు కాక ముందు వారికి ప్రకటింపబడిన సందేశం ఇదే. కుమారత్వమును, దేవుని క్రొత్త నిబంధనలో ఒక భాగముగా దేవుడు వారికి అనుగ్రహించెను (హెబ్రీ 8:10-12; రోమా 8:29; ఎఫెసీ. 1:3-6) దేవుడు మానవాళిని సృష్టించక మునుపే, మానవులు, నిత్య జీవపు గుణ లక్షణములు కలిగిన కుమారులుగా తన నిత్యరాజ్యములో జీవించాలని దేవుడు సంకల్పించెను. మన మహిమ నిమిత్తము మర్మముగా ఉండిన దేవుని జ్ఞానము ఇదే (1 కొరింథీ 2:6-9).

ప్రారంభదినములలో విశ్వాసులైన వారి పితరులవలె దేవుడు వారి దేవుడని అనిపించు కొనుటకు సిగ్గుపడలేదను సంగతి వారెరుగుదురు (హెబ్రీ 11:16). తాము, యేసు యొక్క కుటుంబమునకు చెందిన వారుగా వారు భావించిరి, గనుక తమను సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడడని వారు విశ్వసించిరి (హెబ్రీ 2:11). క్రొత్త నిబంధనను అంగీకరించుట ద్వారా, పరిపూర్ణుడైన కుమారుడగు యేసుక్రీస్తు యొక్క సారుప్యములోనికి తాము మార్చబడగలమని వారికి తెలుసు. కేవలము కృపను బట్టి మాత్రమే తాము దేవుని కుమారులని పిలువబడ లేదని వారికి తెలుసు. క్రొత్త నిబంధనను అంగీకరించుట ద్వారాను, యేసుక్రీస్తును ప్రధాన యాజకునిగా కలిగి యుండుటను బట్టి మరియు తమ పాపముల నిమిత్తమై ఆయన రక్తబలిని బట్టి, తాము కుమారత్వమును పొందియున్నామని వారికి తెలుసు. వారు కలిగియున్న విశ్వాసము, ఆ విశ్వాసమునకు వారు చూపిన విధేయతను బట్టి వారు తిరిగి జన్మించిరి. క్రొత్త జన్మ వలనను మరియు విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడి తాము దేవునితో సమాధానము కలిగియున్నామని, శ్రమలనే క్రమశిక్షణ ద్వారా దేవుని కుమారులుగా అభివృద్ధి చెందవలసిన అవసరమున్నదని వారు ఎరిగియున్నారు. రోమా 4:25-5:5 మరియు హెబ్రీ 12:4-13ను చూడుము.

బహిరంగముగా అవమానపరచబడి చెరలో వేయబడుటతో దేవునికుమారులము అను గుర్తింపు ఏమి చేస్తుంది?అని కొంతమంది మనుష్యులు లేక క్రైస్తవులలో కొందరు ప్రశ్నించవచ్చును. తలిదండ్రులు పిల్లలకు పేరుపెట్టి ఆ పేరుతో వారిని గుర్తిస్తూ, ఆ పేరును ఇంటి పేరుకు ఎందుకు కలుపుతున్నారు? గుర్తింపు జీవితపు మూలధారము. అయితే దానిని నేర్చుకొనవలెను. దేవునికి **న్యాయముగా జన్మించిన** కుమారులుగా అభివృద్ధి చెందుటకు, **శ్రమలను క్రమశిక్షణగా** భావించాలని హెబ్రీ సంఘసభ్యులకు తెలుసును. మరియు వారు దానిని అంగీకరించిన వారే (హెబ్రీ 12:7,8). ఈ విధమైన శిక్షణ కార్యక్రమము నీతియును సమాధానకరమైన ఫలమిచ్చునని

వారికి తెలుసును (12:11). వారు అవమానింపబడినపుడు, నిందింపబడినపుడు, వారి ఆస్తి అపహరింపబడి నపుడు మరియు వారు చెరలో వేయబడినపుడు, అవి "తన పరిశుద్ధతలో పాలు పొందవలెనని వారి మేలు కొరకే దేవుడు వారిని శిక్షించుచున్నాడని" వారెరుగుదురు (12:10). ఒలింపిక్ క్రీడలలో బంగారు పతకమును ఆశించిన క్రీడాకారునివలె, వీరు తమ శిక్షణ కాలములో ఆనందించి యుండవలసిన వారు. హెబ్రీ క్రైస్తవులు విశ్వాసము కలిగి ఉండిరి, అందువలన ప్రారంభ దినములలో ధైర్యమును సహనమును కలిగియుండిరి. శ్రమలను క్రమశిక్షణ చర్యగా వినియోగించడమే దేవుని శిక్షణ కార్యక్రమమైయున్నది. అది లేకుండ "దేవుని కుమారత్వము" అనే కార్యక్రమము లేనే లేదు. దేవుని యొక్క శ్రమల కార్యక్రమము మరియు పరిశుద్ధాత్మని కృపా సహవాసము చేత క్రైస్తవులు క్రొత్త గుర్తింపును తెలిసికొందురు.

ప్రారంభదినములలో, మహిమ పొందాలను కోరిక, వారి ప్రవర్తననుప్రేరేపించినది. దేవుడు తన జ్ఞానము చొప్పున మనుష్యులందరిలో మహిమ కొరకైన అవసరతను సృష్టించెను (1 కొరింథీ 2:7). ఈ హెబ్రీయులను మార్చుటకు ప్రకటింప బడిన సువార్త మహిమ కొరకైన వారి సహజ అవసరత తృప్తిపరచబడునను నిరీక్షణను ఇచ్చినది. యేసు సారుప్యములోనికి క్రైస్తవులు ఆత్మీయముగా ఎదగాలి అను దేవుని సంకల్పమును క్రైస్తవులు విశ్వాసముతో అంగీకరించినపుడు, మహిమ పొందాలి అను మన సహజ కోరిక తృప్తి పరచబడును. అదే సమయములో తండ్రియైన దేవునికి, విధేయులైన పిల్లలుగా మనము ఆయనను మహిమపరచగలము.

హెబ్రీ క్రైస్తవులు కుమారత్వమును అంగీకరించి, దేవుని క్రమశిక్షణకార్యక్రమమను **క్రైస్తవ పరుగుపందెమును** పరుగిడుటకు మొదలు పెట్టిరి. ఆయన సంఘములో దేవుని కుమారులుగా సరియైన గుర్తింపును పొందగలిగిరి. తమ హృదయములపై మనస్సుల మీద దేవుడు తన జీవ నియమములను వ్రాయునట్లు వారు జీవితమును ప్రారంభించిరి (హెబ్రీ 8:10). తమ్మును తాము, దేవుని కుమారులమని గుర్తించు కొనుటను వారు మొదలుపెట్టిరి. మరియు పరిశుద్ధాత్మ కూడ వారితో సాక్ష్యమిచ్చు చుండెను (రోమా 8:16). "శ్రమలతో కూడిన ఈ క్రమశిక్షణ" పథకము ద్వారా వారు యేసుక్రీస్తు యొక్క శీలము మరియు వ్యక్తిత్వము లోనికి మార్చబడుచుండిరి (రోమా 8:29). ఇదే నిత్య జీవము యొక్క సారాంశము. యేసులో ఆ జీవముండెను. అయితే క్రైస్తవులైన మనలో ఆ జీవము ఏర్పడినపుడే, మనము నిత్యజీవము గలవారమగుదము (యోహాను 1:4-12, గలతీ 4:19).

అయినను, ఈ పత్రిక వ్రాయబడు సమయానికి హెబ్రీ క్రైస్తవులు "కుమారులని సంభాషించు ఆయన హెచ్చరిక" మాటను మరచిరని వారికి వ్రాయబడెను (హెబ్రీ 12:5). "మీరు మరచిరి" అని రచయిత చెప్పినప్పుడు, అది "ఊహించు" సమస్య "అయి ఉండవచ్చును" అని అనుకొనే సమస్య కాదు. అందువలన, వారు తమ ధైర్యమును విడిచిపెట్టకూడదని రచయిత వారికి వ్రాసెను (హెబ్రీ. 10:35). దేవుని కుమారులుగా బలహీన గుర్తింపు అభివృద్ధిచెందుట, వారు తమ ధైర్యమును కోల్పోవు గొప్ప అపాయకరమైన స్థితిలో ఉన్నట్లు. తక్కువ స్థాయి గల ధైర్యము వారిని "అలసట పడినట్లు చేసి ప్రాణము విసుగుకొనునట్లు" చేసియుండవచ్చును (12:3).

దిగజారిపోవు మార్గము ఇలాగుండును: నిమ్నస్థాయి బైబిలు అధ్యయనము, విశ్వాసహీనత, ధైర్యము లేకపోవుట, తరువాత ఓర్పు లేకపోవుట (హెబ్రీ. 10:36). తత్ఫలితముగ, "దేవుని కుమారత్వము" అను తర్ఫీదు నుండి అట్టి వారు తొలగి పోదురు. ధైర్యము కావలయునంటే విశ్వాసము ఉండాలి, విశ్వాసము కావలయునంటే దేవుని వాక్యము వినుట అవసరము, కాబట్టి ఈ హెబ్రీ క్రైస్తవులు వినుటకు మందులు గనుక, వారు గొప్ప అపాయకరమైన పరిస్థితిలో ఉన్నారని మనము భావించుట యుక్తమే. అయినప్పటికిని, బైబిలు విద్యార్థులముగా మన అధ్యయనపు ఈ విషయము నందు వారిని గూర్చి ఈ రకమైన అభిప్రాయములకు రావడము మన పనికాదు.

ఈ పత్రికను పొందినవారి మధ్య ఏమి జరుగుతున్నదో దానిని గూర్చి మన ఖచ్చితమైన సొంత ఊహను అభివృద్ధిపరచుకొనుటకు మన చారిత్రాత్మక విశ్లేషణను పూర్తిచేయవలసినదే. రచయిత నుండి ఇంత వరకు సేకరించిన ఖచ్చితమైన సమాచార మును బట్టి, విద్యార్థులుగా వారు మందులని మరియు తాము దేవుని కుమారులను గుర్తింపును లేక భావనను మరచిపోయారని గ్రహీతలను గూర్చి మనము ఖచ్చితముగా ఒక అభిప్రాయమునకు రావచ్చును. ఒకప్పుడు శ్రమలతో కూడిన క్రమశిక్షణ యందు వారు ఆనందించినట్లు, ఇప్పుడు శ్రమలను సహించుటకు వారు ఇష్టపడటము లేదని రచయిత వారిని గూర్చి గట్టిగా చెప్పుచున్నాడు.

మన ఆత్మీయ స్థాయిని ఉన్నతముగా మెరుగుపరచుకొనుట మరియు మన మేధస్సుకు పదునుపెట్టుట నేర్చుకొనుటకు, మనము మన ఊహలను మెరుగుపరచు కోవడము చాలా అవసరము. ఇంతకు మునుపే, మనము నమ్మిన వాటినేలేఖనములు చెప్పుచున్నవని భావించే అవకాశం బైబిలు పాఠకులందరికి ఉంటుందని మొదటి పాఠములో మనము నేర్చుకొంటిమి. మానవ సహజమైన ఈ సమస్యను అధిగమించు టకు మనము చారిత్రాత్మక మరియు సాహిత్యపరమైన విశ్లేషణను బాగా చేయ వలసినదే. రచయిత చెప్పిన, కొన్ని ఖచ్చితమైన మాటలను బట్టి ఈ పత్రిక వ్రాయబడు సమయమునకు, పత్రికను పొందిన వారి మధ్య ఏమి జరుగుచున్నదో దానిని గూర్చి మన ఊహలను మెరుగుపరచుకొందము. మనము చేయు పరిశోధనను కొనసాగిస్తూ ఉండగా, కొన్ని "ఊహించు సమస్యలను," బహుశా మరి కొన్ని "ఖచ్చితమైన సమస్యలను" మనము కనుగొనగలము. సేకరించిన సమాచారమును బట్టి మన ఊహలను సవరించు కోవడమో లేక తప్పుగా ఊహించామని నిర్ణయించడమో అనేది జరుగుతూ ఉంటుంది. ఒకవేళ అలాగే జరిగితే, మనము దానిని ప్రక్కన పెట్టి, క్రొత్తగా చారిత్రాత్మక విశ్లేషణ చేయు పనిని ప్రారంభించుదము.

ప్రత్యేకమైన స్థాయిలో ఒకదానిని గూర్చి ఆలోచించడమే, ఊహించుటను మెరుగుపరచటమని అర్థము. ఎక్కువ మంది పిల్లలు, తాము చూచిన వాటిని గురించి మాత్రమే ఆలోచిస్తారు. వారు ఆలోచించు వాటిని, వారు చూడవలసిన అవసరమున్నది. దానినే యధాతదము అందురు. చిన్నపిల్లల ఆలోచన స్థాయి కంటే, క్రైస్తవులు మెరుగైన స్థితికి ఎదగాలి (హెబ్రీ 5:13). కొంత మంది ఆలోచించు విషయములో సోమరులుగా ఉంటారు, ఆ పని ఇతరులు తమ కొరకు చేయాలని కోరుకొంటారు. బహుశా, హెబ్రీ. క్రైస్తవులు ఇలాంటి సమస్యతో సతమతమౌతుఉ ండవచ్చును (హెబ్రీ. 6:12).

శాస్త్రీయమైన (hermeneutical) దూరమును తొలగించుటకు మనము అధ్య యనము చేస్తూయుండగా ఈ పాఠములో గల లేఖనములు మనకేమి అర్థమిచ్చు చున్నవని ప్రశ్నించుదము. లేఖనములు వారికి ఎంత స్పష్టమైన అర్థమిచ్చినవో, మనకు కూడా అలాగే అర్థమివ్వాలి. దైవికమైన ప్రేరణ కలిగిన రచయిత, స్పష్టమైన మరియు తేలికైన రీతిలో వారికి తెలియపరిచెనని మనము నమ్మవలెను. “నిత్యము మీరు నా రాజ్యములో నాకు కుమారులుగా ఉండాలని దేవుడు కోరుచున్నాడు. అందుకే ప్రేమ కలిగిన శరీర సంబంధియైన తండ్రివలె, మరీ ఎక్కువ కాకుండా లేక మరీ తక్కువ కాకుండా అవసరమును బట్టి శ్రమలతో కూడిన క్రమశిక్షణ చర్య తీసుకొంటానని ఈ క్రింది భాగములో దేవుడు ఈ లేఖనము ద్వారా చెప్పుచున్న మాటలను మనము వినగలిగామా?” దయచేసి హెబ్రీ 12:4-13 మరల చదవండి.

మన ‘ఖచ్చితమైన పట్టిక’లో గల సమస్యలను, తేటయైన మరియు విశాలమైన దృక్పథముతో మన తదుపరి పాఠములో వాటిని పరిశీలించుదము. వారి సమస్యల లోతు ఎంతో తెలుసుకొన వలయును. ఈ పనిని సాధించుటకు మనము “ఊహించిన సమస్యల” పట్టికను చూచెదము.